## అడుగంటిన జలాలు.. పని చేయని చేతిపంపులు

చిగురుమామిడి మండలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఇప్పటి వరకు 42 చేతి పంపులు నీరందక పని చేయడం లేదని గుర్తించిన అధికారులు, వాటిని వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా బొమ్మనపల్లి, సుందరగిరి, చిగురుమామిడి గ్రామాల్లో 15 వరకు చేతిపంపులకు మెకానిక్, జీపీ సిబ్బంది గ్రామస్తుల సహకారంతో మరమ్మతులు చేస్తున్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అవుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడగా, వాటిని సైతం ప్రస్తుతం అరికడుతున్నారు.

*- చిగురుమామిడి, మార్చి 5*



చిగురుమామిడిలో బోరు రిపేర్ చేస్తున్న మెకానిక్

## 'పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా?'

గంగాధర,మార్చి 5: నారాయణపూర్ రిజర్వాయర్‌లో నిండుగా నీరున్నా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ సర్కారు ఉన్న సమయంలో నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని కొడిమ్యాల మండలం మీదుగా గంగాధర మండలంలోని మల్లాపూర్, వెంకంపల్లి, ఉప్పరమల్యాల, కురిక్యాల, కొండన్నపల్లి గ్రామాల్లోని చెరువులు నింపి పంటలకు సాగు నీరు అందించినట్లు గుర్తు చేశారు. నాడు ఎండకాలంలో కూడా చెరువులు మత్తడి దుంకాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. చెరువుల్లో చుక్క నీరు లేదని, బావుల్లో నీరు అడుగంటడం, బోర్లు వట్టిపోవడంతో సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. పాలకులు అధికారులు స్పందించి పంటలు ఎండిపోకుండా చూడాలని కోరారు.

## సాగునీటి కోసం రైతు తిప్పలు

ఒకవైపు ఎస్సారెస్పీ నీళ్లందక, మరోవైపు బావుల్లో నీళ్లు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. కొందరు క్రేన్ల సహాయంతో బావుల్లో పూడికతీత పనులు చేపడుతుండగా, మరికొందరు కొత్త బోర్లు వేయిస్తున్నారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో కూకట్ల రాజయ్యకు చెందిన వ్యవసాయ బావిలో నీరు అడుగంటడంతో రెండు ఎకరాల వరి పంట ఎండుతున్నది. పక్కనే డీ 89 ప్రధాన కాలువ ఉన్నప్పటికీ సమీప ప్రాంతాల్లో పెరిగిన ఇళ్ల నిర్మాణంతో పిల్ల కాలువ కనుమరుగై నీళ్లు రావడం లేదు. ఈ క్రమంలో పంటను కాపాడుకునేందుకు రైతు రాజయ్య బొంతకుంటపల్లి నుంచి భారీ పొక్లెయిన్‌ను తెప్పించి, రెండు రోజులుగా పాతబావిలో తవ్వకం పనులు చేపట్టారు. ఇందుకు గంటకు రూ.4 వేల చొప్పున కిరాయి చెల్లిస్తున్నట్లు రాజయ్య తెలిపారు.

*-కరీంనగర్ రూరల్, మార్చి 5*



భారీ పొక్లెయిన్‌తో కూకట్ల రాజయ్య తవ్విస్తున్న బావి

## గ్రామ సుభిక్షం కోసమే బొడ్రాయి ప్రతిష్ఠాపన



*బేతిగల్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి*

వీణవంక, మార్చి 5: గ్రామం సుభిక్షంగా ఉండడం కోసం భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మ దేవత విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బుధవారం రాత్రి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కావ్య-శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, అర్చకులు, ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాతృభాషను పరిరక్షించుకోవాలి

- శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్
- ఎస్సారార్ కళాశాలలో జాతీయ స్థాయి సదస్సు

కమాన్‌చౌరస్తా, మార్చి 5 : మాట్లాడితేనే భాషలు మనుగడలో ఉంటాయని, ప్రతి ఒక్కరూ మాతృభాషను పరిరక్షించుకోవాలని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ సూచించారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు విభాగం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు సంయుక్త నిర్వహణలో 'తెలంగాణ ప్రాచీన వాఙ్మయం అవలోకనం' పేరిట ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగులో మాట్లాడితేనే తెలుగు భాష కలకాలం వర్ధిల్లుతుందని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, తొలి తెలుగు కంద పద్యాన్ని గుండెల మీద మోస్తున్న కరీంనగర్ గడ్డమీద ఈ సదస్సును నిర్వహిస్తున్నందుకు గర్వంగా ఉన్నదన్నారు. సదస్సు ప్రాయోజకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ, తెలుగు భాషా వికాసానికి జరిగే కార్యక్రమం ఏదైనా కూడా నిర్వహించడానికి ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు ముందుంటుందన్నారు. ప్రముఖ చారిత్రక పరిశోధకుడు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఈ సదస్సులో కీలక ఉపన్యాసం చేస్తూ, తెలుగుకు ప్రాచీన హోదా దక్కడానికి సాక్ష్యాధారాలందించింది కరీంనగర్ జిల్లానేనని, ఇక్కడి బొమ్మలమ్మ గుట్టపై త్రిభాషా శాసనంలో ఉన్న పద్యాలే తెలుగు ప్రాచీన హోదాకు ఆధారాలని వివరించారు. ఈ జాతీయ సదస్సులో దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ఔత్సాహిక పరిశోధకులు సుమారు 70 మంది తమ పరిశోధక పత్రాలు సమర్పించినట్లు తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం డాక్టర్ నలిమెల భాస్కర్, గంద్ర లక్ష్మణరావు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, డాక్టర్ సీహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి, డాక్టర్ ఎస్ జై కిషన్, డాక్టర్ మచ్చ హరిదాసు, తెలుగు విభాగం అధ్యాపకులు, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఉమేష్ కుమార్

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 5: ఖాజీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఖాజీపూర్ అగ్రికల్చర్ ఫీడర్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున గురువారం వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 11గంటల వరకు ఇలవానిపల్లె గ్రామం, నాలుగు ఇండస్ట్రీస్‌లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## పద్మశాలీ మహాసభ విజయవంతం చేయాలి

చిగురుమామిడి, మార్చి 5: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 9న జరిగే అఖిల భారత పద్మశాలీ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంగర మల్లేశం, మంచికట్ల కనకయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పద్మశాలీ కులస్తులు బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఆర్వో ప్లాంట్ అందజేత

గంగాధర, మార్చి 5: గర్శకుర్తి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించడానికి వీలుగా దాతలు దాది హరీశ్, రేణికుంట రత్నాకర్, కుంబోజి రాజశేఖర్, కుంబోజి అంజి, కమటం అనిల్ రూ.20 వేల విలువైన ఆర్వో వాటర్ మిషన్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్యాంకుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రుష్మిత, సీఆర్పీ ఆంజనేయులు, నాయకులు దాది హరీశ్, చిందం ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు భద్రత కల్పించాలి

తెలంగాణచౌక్, మార్చి 3: ఎస్సీ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో బుధవారం మాట్లాడుతూ, నగరపాలక సంస్థలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న యాదగిరిపై దాడి చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నవీన్, వరలక్ష్మి, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

## రక్తహీనతపై అవగాహన పెంచాలి

కలెక్టరేట్, మార్చి 5: కిశోర బాలికల్లో పెరుగుతున్న రక్తహీనతను అరికట్టేందుకు అవసరమైన అవగాహన వారిలో కల్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ అన్నారు. ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'బేటీ బచావో-బేటీ పడావో'పై ఆయా చోట్ల నిర్వహించిన సమావేశాలు, కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సప్తగిరి కాలనీతో పాటు పలు డివిజన్లలోని కేంద్రాల్లో తల్లులు, ఆయా ప్రాంతాల్లోని విద్యార్థినులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన

విద్యానగర్, మార్చి 5: కరీంనగర్ గైనకాలజిస్టుల అసోసియేషన్ (కోగ్స్) ఆధ్వర్యంలో జరుగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని మహిళా రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరై మాట్లాడుతూ, ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫాగ్సీ కార్యదర్శి డాక్టర్ నయని, కోశాధికారి డాక్టర్ తాత్విక, డాక్టర్ అలీం, డాక్టర్ రూఫ్సీ పాల్గొని, క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. ఫిటల్ మెడిసిన్ గురించి స్పెషలిస్టు డాక్టర్ నీలిమ కాసం వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ శ్రీవాణి, టీం మిషన్ కో ఆర్డినేటర్ అనిత, స్టేట్ రిసోర్స్ పర్సన్ సునీత పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుడి మృతదేహాన్ని తెప్పించాలని వినతి

గన్నేరువరం, మార్చి 5: గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి మొండయ్య అలియాస్ గత్తర మొండయ్య అనే గల్ఫ్ కార్మికుడు ఈ నెల మూడో తేదీన సౌదీలోని రియాజ్‌లో గుండెపోటుతో మృతి చెందగా, మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని గ్రామానికి చెందిన నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరారు. బుధవారం మొండయ్య కుమారుడు క్రాంతితో గ్రామ మాజీ సర్పంచ్ అజయ్ వర్మ, రజక సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ కరీంనగర్‌లో బండి సంజయ్ కుమార్‌ను కలిశారు. మొండయ్యకు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉండగా, మృతదేహాన్ని తీసుకువచ్చే స్థోమత లేక కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారని నాయకులు వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం చొరవ తీసుకోవాలని కోరారు.

## రజక మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలి

కరీంనగర్ రూరల్, మార్చి 5: కుల వృత్తి చేస్తున్న రజక మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ కోరారు. బుధవారం తీగలగుట్టపల్లిలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మండల మహిళా సమాఖ్య సంఘాల తరహాలోనే రజక మహిళా సంఘాలకు నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చాకలి ఐలమ్మ గర్జన సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం అధ్యక్షురాలు గుండేటి మల్లేశ్వరి, తీగలగుట్టపల్లి అధ్యక్షురాలు మామిడి లత, కార్యదర్శి తొర్రి సరిత, ఉపాధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, కూనిరాజుల రజిత, మేడిచెల్లిమెల దీప, శోభ తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని వీణవంక పోలీసులు పట్టుకున్నారు. సుల్తానాబాద్‌కు చెందిన పర్వతం ప్రసాద్ మండలంలోని చల్లూరు గ్రామంలో అక్రమంగా క్వింటాలు 70 కిలోల పీడీఎస్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## హోంవర్క్ చేయలేదని విద్యార్థిని చితకబాదిన టీచర్

గంగాధర, మార్చి 5: హోంవర్క్ చేయలేదన్న నేపంతో విద్యార్థిని చితకబాదడంతో పాటు తోటి విద్యార్థులతో కొట్టించిందో ఉపాధ్యాయిని. విద్యార్థిని తండ్రి మురళీ మనోహర్ కథనం ప్రకారం.. బోయినపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సావనపెల్లి సమీర్‌కుమార్(7) అనే విద్యార్థి మండలంలోని మధురానగర్‌లోని సురభి పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. బుధవారం విద్యార్థి ఇంగ్లిష్ హోంవర్క్ చేయలేదని ఓ ఉపాధ్యాయిని విద్యార్థిని చితకబాదింది. అంతే కాకుండా తరగతి గదిలో ఉన్న 30 మంది విద్యార్థులతో సమీర్‌కుమార్‌ను చెంప దెబ్బలు కొట్టించింది. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థి రెండు చెంపలు కందిపోయి ఉండడంతో తల్లిదండ్రులు ప్రశ్నించగా జరిగిన విషయాన్ని వివరించాడు. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేయగా, సదరు ఉపాధ్యాయినిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారన్నారు. ఎంఈవో ప్రభాకర్‌రావును వివరణ కోరగా, పాఠశాలను సందర్శించి, విచారణ చేస్తామని తెలిపారు.

## పర్తి యాత్రను జయప్రదం చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 5: పుట్టపర్తి సత్యసాయిబాబా దివ్య దర్శనం కోసం ఏప్రిల్ 5,6,7 తేదీల్లో శ్రీసత్యసాయి సేవా సంస్థలు తెలంగాణ యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న పర్తి యాత్రను జయప్రదం చేయాలని పుట్టపర్తి సత్యసాయిసేవా సంస్థల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాల్తేపు లింగమూర్తి కోరారు. నగరంలోని బాబా ఆలయంలో బుధవారం ముఖ్య సేవా సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పర్తి యాత్రకు వచ్చే పురుషులు సమన్వయకర్త శ్రవణ్‌ను 9676614647లో, మహిళలు సమన్వయకర్త సౌమ్యను సెల్ 8639266767లో సంప్రదించాలని సూచించారు.

## ఎంఎస్ఎంఈపై అవగాహన

విద్యానగర్, మార్చి 5: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) ప్రోత్సహించేందుకు బుధవారం నగరంలోని రంగినేని గార్డెన్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ శివ వరప్రసాద్ హాజరై.. ఆర్థిక వృద్ధిలో ఎంఎస్ఎంఈల ప్రాముఖ్యత, వివిధ ఆర్థిక ఉత్పత్తులు, పారిశ్రామిక వేత్తలకు మద్దతు ఇచ్చే ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జయంతి, లయన్స్‌క్లబ్ చైర్మన్ కొండా వేణుమూర్తి, కరీంనగర్ రీజనల్ హెడ్ అపర్ణారెడ్డి, వినియోగదారులు పాల్గొన్నారు.

# మలుపు తిరిగిన కాంట్రాక్టర్లు, ఈఈ వివాదం

- కాంట్రాక్టర్ల సంఘంలో వర్గాలు
- తమకు సంబంధం లేదంటూ ఓ వర్గం కలెక్టర్ వినతి

కార్పొరేషన్, మార్చి 5: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలోని ఈఈ వర్సెస్ కాంట్రాక్టర్లుగా కొనసాగుతున్న వివాదం కాస్తా కొత్త మలుపు తిరిగింది. ఇప్పుడు నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘంలో ఓ వర్గం ఈ వివాదంతో తమకు సంబంధం లేదంటూ బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించడం ఇప్పుడు సరికొత్త చర్చకు దారి తీసింది. ఇటీవల నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉండగా కొందరు కాంట్రాక్టర్లు వచ్చి తనను దూషించడంతో పాటు, ఇబ్బంది పెట్టారని ఈఈ యాదగిరి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం నాయకులు అధికారి తమను ఇబ్బంది పెడుతున్నారని, అక్రమంగా బినామీల ద్వారా పనులు చేపడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎవరికి వారుగా తమ వాదనను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు వినిపిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘానికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు కలెక్టర్‌కు ఈ వివాదంతో తమకు సంబంధం లేదంటూ విన్నవించారు. కొందరు కాంట్రాక్టర్లు వ్యక్తిగత కక్షలతో అధికారులతో వివాదం పెట్టుకుంటున్నారని, ఒక కాంట్రాక్టర్‌కు అధికారి మధ్య జరిగిన గొడవకు అసోసియేషన్‌కు సంబంధం లేదంటూ పేర్కొన్నారు. తమకు విషయం చెప్పకుండా పెండింగ్ బిల్లుల మంజూరు కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్నామని పేర్కొని, తమ సంతకాలు తీసుకొని అసోసియేషన్ పేరుతో ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. దీంతో రానున్న రోజుల్లో ఈ వివాదం ఎటు వైపు మలుపు తిరుగుతుందోనన్న చర్చ బల్దియాలో సాగుతున్నది. కేవలం కొందరు వ్యక్తులు తమ ప్రాబల్యం కోసం అసోసియేషన్‌ను వాడుకుంటున్నారన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.

# ఆరోగ్య కేంద్రాలకు నిరంతర విద్యుత్: ఎస్ఈ

ముకరంపుర, మార్చి 5: జిల్లాలోని దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు తెలిపారు. నగరంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన, మాతా శిశు కేంద్రం (మదర్ అండ్ చైల్డ్ కేర్ హాస్పిటల్), కలెక్టరేట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్ సరఫరా తీరును బుధవారం పరిశీలించారు. అత్యవసర సేవలందించే దవాఖానలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఈ తెలిపారు. సాంకేతికంగా ఏదైనా సమస్య తలెత్తి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే సత్వరమే పునరుద్ధరించేలా ఆటో జెనరేటర్‌ను పని చేసే స్థితిలోకి తీసుకురావాలని దవాఖాన అధికారులకు సూచించారు. అలాగే వాటర్ వర్క్స్, మిషన్ భగీరథ, ఫిల్టర్ బెడ్ ఐటీ పార్క్ ఫీడర్లలో విద్యుత్ సరఫరా తీరును తనిఖీ చేశారు. ఎస్ఈ వెంట డీఈ జంపాల రాజం, ప్రభుత్వ ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈ, సిబ్బంది ఉన్నారు.

### హుజూరాబాద్ దవాఖాన సందర్శన

హుజూరాబాద్ టౌన్, మార్చి 5: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను బుధవారం ట్రాన్స్‌కో అధికారులు సందర్శించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోగానే దవాఖానలో ఏర్పాటు చేసిన జనరేటర్ ఆటోమేటిక్‌గా ఆన్ అయ్యేలా ఏర్పాటు చేసిన సౌకర్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ట్రాన్స్‌కో డీఈ లక్ష్మీరెడ్డి, ఏఈ శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- మొదటి రోజు 549 మంది గైర్హాజరు

కమాన్‌చౌరస్తా/మానకొండూర్/మానకొండూర్ రూరల్/వీణవంక/ హుజూరాబాద్ టౌన్, మార్చి 5: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో జిల్లాలో ఏర్పాటు చేసిన 58 కేంద్రాల్లో జనరల్‌లో 17,011 మంది, ఒకేషనల్‌లో 1646 మంది మొత్తం 18,657 మంది విద్యార్థులకు గానూ 18,108 మంది పరీక్షలకు హాజరయ్యారు. 549 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అధికారులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. పరీక్ష కేంద్రాలకు వచ్చిన విద్యార్థులను బయట ఆపకుండా, వచ్చిన వారిని వచ్చినట్లే కేంద్రంలోకి పంపించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు సీసీ కెమెరాల నిఘా మధ్య ప్రశ్న పత్రాలు తెరిచి, పరీక్ష కేంద్రంలోకి పంపారు. పలు కేంద్రాలను డీఐఈవో జగన్‌మోహన్ రెడ్డి, అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో మొదటి రోజు ప్రథమ సంవత్సరం పరీక్షకు 122 మంది విద్యార్థులకు గానూ అందరూ హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కే రాజేశ్వర్ తెలిపారు. దేవంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 180 మంది విద్యార్థులకు గానూ 170 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం వెల్లడించారు. వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 148 మంది విద్యార్థులకు గానూ 147 మంది హాజరయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీందర్ పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 813 మంది విద్యార్థులకు గానూ 795 మంది పరీక్షలు రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ప్రసాద్, వేణుమాధవ్, కుమారస్వామి తెలిపారు.



*నగరంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు*

## శ్రీచైతన్యలో ఫ్రెషర్స్ హంగామా

తిమ్మాపూర్, మార్చి 5: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ విభాగాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాలను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు నరేశ్ కుమార్, ఓదెలు యాదవ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

### స్పోర్ట్స్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ

కళాశాలలో ఈనెల 17 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను సిబ్బందితో కలిసి శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్ రెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాదరాజు, స్పోర్ట్స్ మీట్ ఇన్‌చార్జి వినయ్, ఏవో రామారావు, లైబ్రేరియన్ గొంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 5: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఎంఈవో బీ శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పట్టణంలోని మాంటిసోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో, పాఠశాల చైర్ పర్సన్ జోస్ నెడుంతుండం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని, అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు వివిధ ప్రయోగాలను ప్రదర్శించి, వివరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన జీఎస్ఎల్‌వీ 3 రాకెట్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గీతా షాజు, డైరెక్టర్ షాజు థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాకెట్ నమూనాను తయారు చేసిన విద్యార్థులతో ఎంఈవో శ్రీనివాస్

## వింధ్యావాలీలో ఆకట్టుకున్న ఫేర్ వెల్ డే

కొత్తపల్లి, మార్చి 5: నగరంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో ఎస్సురెన్జ్-2025 పేరుతో బుధవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆటపాటలతో ఆకట్టుకున్నది. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులు మంచి విద్యభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, మార్చి 5 : కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఇటీవల ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కొల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని ఎన్ విన్మయ పాల్గొని ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ఎన్ విన్మయను పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమారెడ్డి, కోచ్ అభిషేక్, ఉపాధ్యాయులు అభినందించారు.

## డంప్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి5: హుజూరాబాద్‌లో డంప్ యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. డంప్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇక్కడ నాయకులు ప్రభాకర్, రవీందర్, ఖాలీద్ హుస్సేన్, శ్రీనివాస్, రాజు, సమ్మయ్య, తులసీ లక్ష్మణ మూర్తి, పెండ్యాల మహేందర్ తదితరులు ఉన్నారు.

## ఎం.ఫార్మసీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, మార్చి 5: ఎస్‌యూ పరిధిలో ఎం.ఫార్మసీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు www.satavahana.ac.in, http://103.119.113.107:89లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## ఆదివాసీలను విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం

శంకరపట్నం, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ ఎరుకల పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నదని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. ఆదివాసీ ఎరుకల పేద విద్యార్థులు విదేశీ విద్యనభ్యసించేందుకు తోడ్పడేలా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ పథకాన్ని ప్రవేశపెడితే ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి దానిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సైతం ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు న్యాయం చేయకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీయక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కోనేటి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాడి తిరుపతి, కోశాధికారి మానుపాటి మల్లేశం, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌యూ సహాయ ఆచార్యుడికి పేటెంట్

కమాన్‌చౌరస్తా, మార్చి 5 : శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర సహాయ ఆచార్యుడు, ఎస్‌యూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ కోట రాజుకు 'కంపారిటివ్ స్టడీ ఆఫ్ ఆనోడ్ – కాథోడ్ పేరింగ్ ఫర్ మాక్సిమం సెలెక్టివిటీ ఇన్ ఎలక్ట్రో కెమికల్ పొల్యూటెడ్ డిగ్రేడేషన్' అంశంపై పేటెంట్ లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజును విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నమ్రత, సరసిజ, ఇతర సైన్స్ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వీణవంక, మార్చి 5: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ వేల్పుల రాజు ఇటీవల మృతిచెందగా, అతడి కుటుంబానికి తోటి ఫొటోగ్రాఫర్స్ ఆర్థిక సాయం అందజేసి, అండగా నిలిచారు. బుధవారం రాజు ఇంటికి వెళ్లి అతడి కుటుంబ సభ్యులకు రూ.1.60 లక్షల చెక్కు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం మండలాధ్యక్షుడు సంగె మోహన్, ప్రధానకార్యదర్శి కళ్యాణం రాజు, కుటుంబ భరోసా ఇన్‌చార్జి కర్రె నాని, రాష్ట్ర ఫొటో, అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం సలహాదారు కేదార్ రెడ్డి, ప్రధానకార్యదర్శి లడె రవి, సభ్యులు శ్రీనివాస్, రమేశ్, భాస్కర్, సంతోష్, సుమన్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 5 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగరంలోని మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్త్రీ స్వావలంబన, స్త్రీ స్వేచ్ఛ –అవకాశాలు ఇలా వివిధ అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ రజనీ దేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కల్పన, ఎన్సీసీ కేర్ టేకర్ డాక్టర్ స్రవంతి, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శస్త్ర చికిత్సకు 34మంది ఎంపిక

విద్యానగర్, మార్చి 5: లయన్స్ క్లబ్ ఆఫ్ మంకమ్మతోట ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్సకు 34 మంది ఎంపికైనట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బూర్ల విద్యాసాగర్, అంబటి రవీందర్‌రాజు, సెక్రటరీ గుండోజు లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మండలం నల్లగొండతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 45 మంది ప్రజలకు పరీక్షలు చేయగా 34 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఎంపికైన వారిని బస్సులో రేకుర్తి కంటి దవాఖానకు తరలించారు. గురువారం ఉదయం వారికి శస్త్ర చికిత్స చేయనున్నట్లు కంటి దవాఖాన వైద్యుడు ప్రభాకర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★ ఇంటి స్థలం యాదగిరిగుట్టకి 1 కి.మీ., వరంగల్ హైవేకి 3 కి.మీ., రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి అతి దగ్గరలో రెసిడెన్షియల్ ప్లాట్లు అమ్మబడును. B.T. Road Face... ఈరోజే ఇల్లు/కాటేజ్/గెస్ట్‌హౌస్ కట్టుకోవచ్చు. LRS కలదు. Cont: 6300765739.
NT-329217

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads



మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189